# సైనికుని ప్రేమకలాపం

టి. యన్. వెంకటరాఘవులు

అదొక హాస్పిటల్. నర్సుల కిలకిలారావాలతో, యువక డాక్టర్ల హడావుడితో, రోగిష్ఠుల రోదన వేదనలతో, కాంపౌండర్ల గుసగుసలతో మిక్కిలి గల్లంతుగా వుంది.

"ఆడవాళ్ళు నేనంటే పడిచస్తారు" తనతో బాటు గాయాలు తగిలి బాధపడుతున్న తోటి సైనికులతో చెప్పాడా యువక సైనికుడు. అతను సన్నగా, పొడుగ్గా, నాజుగ్గా వుంటాడు. ఆ హాస్పిటల్ లో అతనితో బాటు త్రిమూర్తుల్లాగా మరిముగ్గురు సైనికులు చికిత్స పొందుతున్నారు. వాళ్ళందరు గడ్డిపరుపు వేసిన మంచాల మీద పరుండివున్నారు. యిద్దరు యేమీతోచక యింటి కప్పువాసాలు లెక్కపెడుతున్నారు. మూడో వాని పరిస్థితి చాలతీవ్రంగా వుంది. అతను చలితో గడగడ వణకుచు నిండు ముసుగుపెట్టుకున్నాడు.

గాయాలు తగిలిన సైనికులు చాలవిసుగ్గా, మత్తుగావున్నారు. ఏమైతేనేం, యుద్ధరంగానికి వెళ్లాలనే ఆతురత, ఆవశ్యకత వాళ్ళలో ఎవ్వరికీలేదు. అబ్బ! పాడుయుద్ధరంగం; వెళ్లినదగ్గర్నుండి కందకాలు త్రవ్వాలి, సైన్యాధిపతిఆజ్ఞలను పాలించాలి. శత్రువుల గుండుదెబ్బలు తట్టుకోవాలి, తప్పుకోవాలి. వాళ్ళతో ఒకడు కీళ్ళనొప్పితో బాధపడుచున్నాడు ఇంకొకనికి కాలు విరిగిపోయింది. నిండా ముసుగుపెట్టుకున్నవాడు అప్పుడే టైఫాయిడ్ నుండి కోలుకుంటున్నాడు. అందంగావున్న ఆ సైనికుడు యేదో సుఖరోగంతో బాధపడుచున్నాడు.

"ఆడవాళ్లు నేనంటే పడిచస్తారు. నేనబద్ధాలాడుతున్నా ననుకున్నారా? దైవసాక్షిగా నిజాన్నే చెబుతున్నా. మరి నేనంటే వాళ్ళెందుకు పడిచస్తారో నాకే అర్థంకావటంలేదు. ఆభగవంతుడికే తెలియాలి. కాని ఆడవాళ్ళను యెలా మచ్చికచెయాలో నాకు బాగా తెలుసు. అసలుకిటుకు యేమిటంటే ఆడవాళ్లను యెప్పుడు చులకనచేయకూడదు వారితో యెల్లామెలగాలో మొట్టమొదట నేర్చుకోవాలి. మర్యాదస్థులదగ్గర మర్యాదచూపాలి. పరిహాసించేదాన్ని, మరీపరిహాసించాలి. నీవు చెప్పినదానికి ఆమె ఔనని తలూపితే, ఆమె చెప్పిందానికి నీవు కూడా తలూపాలి. ఆవిడకాదన్నదాన్ని నీవు కాదనాలి. ఆవిడకేదియిష్టమో అదేనీకిష్టమవాలి. యిలా వారివారి మనస్తత్వాన్ని గ్రహించి ప్రవర్తించితే యే స్త్రీనైనా బుట్టలో వేసుకోవచ్చు. యిదే దానిలోని చిదంబరరహస్యం.

"మరొకమాట యేస్త్రీదగ్గర కెళ్ళుతావో ఆ స్త్రీని, నీ వేరంభ, ఊర్వశిఅనాలి. ఆవిడ అందం జగద్విఖ్యాతమని, నిన్ను ఉన్మత్తునిచేస్తుందని మరి యింకా లేనిపోనివి చెప్పాలి. నీవు ఆరాధించే యేకైక ప్రణయదేవత ఆమేనని నమ్మకం కలిగించాలి మీపాత ప్రణయకలహాలు. ఆవిడకేమాత్రం తెలియకూడదు సుమండి. తెలిసిందంటే యిక కథ అడ్డంతిరుగుతుంది. అసలు ఆడవాళ్లదగ్గరున్న విచిత్రస్వభావమే అది. ఒకస్త్రీ తనప్రియుడు న్నే ప్రేమించాలని కోరుతుంది. మరిదేన్ని సా

సహిస్తుంది కాని తనవాడు మరొకర్ని వాంఛిస్తున్నాడంటే ఆవిడ తనసహనశక్తిని కోల్పోతుంది. కనుక తస్మాత్ జాగ్రత!

"ఒకప్పుడు నేను కెప్టెన్ ప్రసాద్‌తో కలిసి పని చేసేవాణ్ణి. అతడు చాలస్వతంత్రజీవి. అతనింట్లో ఒకకుఱ్ఱది పనిచేసేది. అది నిండుయౌవ్వనంతో మిసమిసలాడుతూ చాలఅందంగా వుండేది. ఆ కుఱ్ఱదానికి మంచిమర్యాదకూడా తెలుసు. మొదట దాన్ని తేలికచేసి వశపరచుకోవాలనుకున్నా. కాని ఆపప్పులేం వుడకలా. యిక ప్లేటుమార్చి వేసాను, అది కానంటే కానని, కాదంటే కాదని, తాళంవెయ్య మొదలెట్టాను. అదియెక్కడకువెళ్లితే అక్కడకు వెళ్లేవాణ్ణి. ప్రతిరాత్రి దాంతోనే గడిపేవాణ్ణి. 'క్రొత్తకవింత, పాతొకరోతని' కొన్నాళ్ళకి అదంటే విసుగెత్తింది. అదీసంగతి. ఆడవాళ్లు నేనంటేపడిచస్తారు..."

యువకడాక్టరు థర్మామీటరు చేత్తోపట్టుకుని గదిలోకి వచ్చాడు. "ఒరే అబ్బాయి అప్పుడే మొదలెట్టావు నీకూతలు. పచ్చిసారకాయలు కోసేస్తావురా. అదని యిదని కోసెయ్యి. అందుకనేరా బాబు, నీకువాళ్లు తగినబహుమతి అందించారు" అన్నాడు.

"వీళ్ళదుంపతెగ ఆడవాళ్లు వీళ్లకు యేదేవు శాపం తగులుతుందోకాని, నిజంగా నాజీవితం వీళ్లే నాశనంచేసారు" అన్నాడా అందగాడు.

పిల్లడాక్టరు ముసుగుపెట్టుకున్నవాని టెంపరేచర్ కనుక్కొని వెళ్లాడు.

"అదీఅసలు సంగతి. ఆడవాళ్లు నేనంటే పడిచస్తారు" అంటూ మళ్లాప్రారంభించాడు. "వాళ్లు నేనంటే యెందుకుపిచ్చివారైపోతారో నాకే తెలియదు. నాతోయింతవరకు ఆవిషయములోపోటీనిలచిన మొగాడేలేడు. అమ్మతోడు. యిదంతా అక్షరాలానిజమే. నిరుడుసంవత్సరం నేను సెలవుమీదవున్నానా. అప్పుడల్లా ఆడవాళ్లను వదిలించుకుందామనుకున్నాను కాని వదలించుకోలేకపోయాను. మళ్లీఅందరూమిలటరీ వాళ్ళపెళ్లాలే. చెబితేమీరునమ్మరు!

"అవును నీవుచెప్పిందినిజమే. మిలటరీవాళ్ళ పెళ్లాలంతా అంతే. భర్తలు యింటివద్ద వుండరు కదూ! యింకేం వారిపాడుజల్సా" అన్నాడు కాళ్లనొప్పి సైనికుడు.

'అవునురా అబ్బాయీ! వాళ్ళకేమిభయం గనక. కష్టపడేవాళ్ళమేమో కష్టపడిపోతున్నాము. సుఖంగా కాలుమీద కాలువేసుకుని తింటూ వుంటారు, వూరకవుండనిస్తుందా? నాపెళ్ళాం అలాచేస్తే ప్రాణం తీసేయనా" అన్నాడా కాళ్ళువిరిగిన సైనికుడు.

"అవునవును. నీవలాగా అంటావే గాని ఆచరణకొచ్చేసరికి పెద్దగుండుసున్నా తయారవుతుంది. పాపం వాళ్ళుమాత్రం సంవత్సరాలతరబడి నీకోసం కళ్ళు కొండెంతలుజేసి యెదురుచూస్తుండాలా" అని అందుకున్నాడా యువక సైనికుడు.

"ఊఁ యిందాక చెబుతున్నానే ఆవిషయం సరేనా! సెలవులకి యింటికి వెళ్ళాను. భలేతమాషాగా గడిచిపోయిందిలే కాలం. వూళ్ళో ప్రతివాడు నాకు సలాముగొట్టడమే. నేనంటే ఎంత మర్యాదనుకున్నారు. వీథులవెంట ఆడవాళ్ల కోసం కుక్కలా తిరగడం నాకెప్పుడూ సరిపోదు. నాకసలటువంటి వాసంటేనే అసహ్యం. నూత్నయౌవ్వనంతో నవనవలాడే యువకులంటే నాకు బలేసరదా.

"మావూరిలో బస్సుదిగుతామే దాని ప్రక్కగొందిచివరన ఒక కడ్డీల యిల్లువుంది. ఆయింట్లో ఒక అమ్మాయి కాపురం చేస్తూవుండేది చాలబాగుంటుంది. అంబాలభరిణ అంటే అదే నండి. సైనికుడి పెళ్ళాం. ఆ అమ్మాయి పేరు కమల. చాలవిశాలమైన కళ్ళు, గులాబిరంగు పెదిమలు ఆలేతబుగ్గలు, అబ్బ! నిజంగాచాలఅందంగా వుంటుందిలే! నేచెప్పేది అబద్ధమైతే మీలోయెవరైనా మావూరువెళితే పరిశీలించండి. ఇక చూడు. ఆ అమ్మాయిని చూడ్డంతోటే ఆవిడ సౌందర్యానికి దాసునైపోయాను. నామనస్సంతా దాని పైనే నిలచిపోయింది. ఆ అమ్మాయికావాలని

చాలతంటాలు పడ్డాను. నా మొహమైనా చూచేది కాదు. ఏంచెప్పినా వినేదికాదు. నా వాసన తగిలితే చాలు, ముక్కు, చెవులు, కిటికీలు అన్నీ మూసివేసేది. మొదట కొంచెం జబర్దస్తీచేసి వశపరచుకుందామనుకున్నాను. ఏం లాభంలేక పోయింది, యిక మర్యాదపద్ధతులతో ప్రాథేయపడ్డాను. అదీ నిష్ప్రయోజనమయింది. నానా త్రిప్పలు పడ్డా నన్నది లక్ష్యపెట్టేది కాదు. ఆమెతోబాటు రోజూ షికారు వెళ్లేవాణ్ణి. ఈ రాత్రి తప్పకవస్తానని అడిగి అడిగి నా నోరే పడిపోయింది. ఒకనత్రైనా నవ్వేదికాదు, అసలు ఆ మొహానికి నవ్వేరాదేమో ననిపించేది.

అలాంటినిప్పుతునక ఒకరోజు నాదగ్గరకు తానే వచ్చింది. "ఇకభరించలేను, నా సహన శక్తిని కోల్పోయానని" బావురుమనియేడ్చింది. ఆమెభర్త సైనికుడట. అతన్ని కలుసుకుని రెండు మూడు సంవత్సరాలయ్యిందట. ఆవిడను మెల్లగా ముద్దెట్టుకుని నాచేతుల్లోకితీసుకుని, గట్టిగా కౌవిలుంచుకుని సరే, యింకదంతా చేసాననుకో. ఆ శెలవులకాలమంతా ఆమెను నాభార్యలా అనుభవించాను. ఆమెతో పొందిన సుఖం అమరసుఖం. మరెవ్వరిదగ్గర అలాంటిసుఖం లభించలేదంటే నమ్మ. చాలబాగుండేదిలే, నేనక్కడికివెళ్లినా నాతో నీడలా అక్కడకు వచ్చేది. ఎంత అమాయకంగా నవ్వేదనుకున్నారు! బలేపసందైన గుంటలెండి. అన్నిటికంటే ఆవిడదగ్గరి తమాషా యేమిటంటే యింక యేపిల్లవెధవ మొహమైనా చూచేదిగాదు. పాపం! నాకేనాడూ యెదురు చెప్పేదిగాదు.

"ఆడవాళ్ళు సేనంటే పడిచస్తారు. అబద్ధం కాదుసుమా!"

"నీదేజిల్లానయ్యా! అనిఅనుమానంగా అడిగాడాకీళ్ళనొప్పి సైనికుడు.

"చిత్తూరు జిల్లా! ఖర్మంకాలి మనిద్దరిది ఒకే జిల్లా కాదుగదా!"

"కాదు. మాది నెల్లూరుజిల్లా"

"కామ్రేడ్ చిత్తూరుజిల్లాలో మనదేవూరు? ఆదుర్దాతో ప్రశ్నించాడా ముసుగులోని సైనికుడు.

"తిరుపతి. కొంపదీసి మనిద్దరు ఒకవూరివారం కాదుగదా!

"అవునవును. మనిద్దరం ఒకవూరివాళ్ళమే. మాది ఆగ్రామమే"

"అయితే నీకు కమల తెలుసన్నమాట. ప్రశ్నించాడా ముసుగుసైనికుడు చెమటతుడుచుకుంటూ!!

"ఆ! ఆవిడ నాకు తెలుసు. ఆమె నాభార్య! మనిద్దరం ఒకవూరివాళ్లమే, అన్నాడు హీనస్వరంతో" ముసుగులోని సైనికుడు.

"యిప్పటికయినా నమ్మండి. ఆడవాళ్లు సేనంటే పడిచస్తారు. అందరూ అదేఅంటారు" అంటూ వెకిలిగా నవ్వాడా కుర్రాడు.

ఆనందవాణి

పోస్టుబాక్సు నెంబరు

1583

—మేనేజరు

